

Crime & PunishmentCrime
Crime & PunishmentCrime

# నేరము - శిక్ష

Crime & PunishmentCrime
Crime & PunishmentCrime

**మెక్ డోనాల్డ్ రెస్టారెంట్‌లో ఓ మూల చెయిర్‌లో కూర్చుని రవళి డైట్ కోక్ తీసుకొంటోంది. నిమిష నిమిషానికి గడియారాన్ని చూసుకుంటూ అసహనంగా రోడ్డుపై వచ్చిపోయే వాహనాలను చూస్తోంది. ఎప్పుడెప్పుడు రవీందర్ వస్తాడా అని చకోర పక్షిలా ఎదురు చూస్తోంది. ఆమె నిరీక్షణకు ఫుల్‌స్టాప్ పెడుతున్నట్లు రవీందర్ బైక్ పార్క్ చేయడం కనిపించింది. అయినా రవళి మొహంలో విసుగుపోలేదు.**

## షాక్

**- ఆదిత్య**

రవీందర్ రెస్టారెంట్‌లో అడుగు పెట్టేసరికి అక్కడున్న అందరి దృష్టి అతని పైనే నిల్చింది. రవీందర్ నేరుగా రవళి టేబుల్ దగ్గరకు చేరి దాసుడి తప్పులు దండంతో సరి అన్న చందాన తన చేతిలో లాఠీ రవళి ముందుంచి దండించమన్నట్టుగా చేయి చాచాడు.

కరడు గట్టిన నేరస్థులుసైతం రవీందర్ పేరు విన్నా, రవిని చూసినా గజగజా వణికిపోవాల్సిందే అలాంటిది తన ముందు అమాయకంగా దోషిలా నిల్చున్న రవీందర్‌ను చూస్తే ముచ్చటేసింది రవళికి.

వస్తున్న నవ్వును పెదవుల మధ్య బిగించింది రవళి.

''ఒన్ మినిట్...'' అంటూ రవీందర్ రవళికి ఇష్టమయిన పనీర్‌పీజా, కోక్ గ్లాసులు ట్రేలో పెట్టుకొచ్చి టేబుల్ ముందుంచాడు.

అయినా రవళి బెట్టు సడల లేదు.

''అబ్బా ఇంకా నన్నేం చేయమంటావు...'' వేడుకోలుగా అడిగాడు రవీందర్.

''ఒక్క నిమిషం నా దగ్గరకు వచ్చే ముందు నీ వేషం చూసుకున్నావా....?'' కోపంగా అంది రవళి.

అప్పుడు అర్థమయిందతనికి తను చేసిన పొరపాటేవిటో.

''ఐ... యామ్... వెరీ సారీ డార్లింగ్. నిన్ను కలుసుకోవడం లేటవుతుందని వంటి మీదున్న యూనిఫాం సంగతి ఆలోచించనే లేదు....''

''చేసిన నిర్వాకం చాలు కాని కూర్చోవయ్యా... అందరూ మననే చూస్తున్నారు. అసలు పోలీసు వాణ్ణి ప్రేమించడం నాదే బుద్ధి పొరపాటు...'' అంటూ ట్రేలో ఉన్న పీజా చేతిలోకి తీసుకుంది.

''అదేంటి రవళీ అలా మాట్లాడతావు పోలీసులు మనుషులు కారా! వాళ్ళకు మనసుండదా...''

''ఎందుకుండదూ ఉంటుంది కాని వారి ధ్యాసంతా నేరస్తుల చుట్టే పరిభ్రమిస్తుంటుంది....అది సరేగాని ఈ రోజు ఎందుకు ఆలస్యమయిందంటావు... రోజూ ఓ కొత్త కథ చెబుతావుగా ఈ రోజేం కథ చెప్పాబోతున్నావు...'' కోక్ గుటక లేస్తూ అడిగింది.

''నీకు నవ్వులాటగా ఉంది కాని ఇది సిటీనే వణికిస్తున్న సీరియల్ కిల్లర్ కథ....''

''అంటే నువ్వు చెప్పేది రశ్మి, రేఖల హంతకుడి గురించా...'' ఆసక్తిగా అడిగింది రవళి.

''నీకు తెలిసింది అంతవరకే, ఈ రోజు మరో అమ్మాయి రజిత హత్యకు గురైంది. ఆ కేసు అటెండ్ చేసి వస్తున్నాను...''

''ఓహ్... సారీ రవీ నీ మనసు నొప్పించినందుకు. ఇంతకూ ఈ సీరియల్ కిల్లర్ ఎవరంటావు....?''

''అదే ఇంకా అంతుబట్టటం లేదు. విచిత్రమేమిటంటే వీళ్ళంతా కూడా ప్రముఖ బిజినెస్ మాగ్నెట్ రాహుల్ దాస్ సెక్రటరీలు కావడం విశేషం....''

''మరయితే అతనే ఈ హత్యలు చేసుండొచ్చుగా....'' అనుమానం వ్యక్తం చేసింది రవళి.

అంతలోనే చుట్టూ చూసి చీకటి పడుతుండటంతో ''అయ్య బాబోయ్.... నీ వెంట ఉంటే నా బుఱ కూడా పోలీసు బుఱ అయ్యేలాగుంది. చీకటి పడుతోంది... ఇక బయల్దేరుదాం....'' అంటూ బ్యాగ్ చేతిలోకి తీసుకొని లేచింది రవళి.

''పద....పద...'' అంటూ రవళిని ఇంటి దగ్గర డ్రాప్ చేయడానికి సిద్ధమయ్యాడు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్.

★★★

ఆర్. డి. ఇండస్ట్రీస్ ఛైర్‌మెన్ రాహుల్ దాస్ తన చాంబర్‌లో బిజీగా ఉన్న వేళ ఏ. ఎస్. ఐ. రవీందర్ అతన్ని కలిసాడు.

రవీందర్‌ని సాదరంగా ఆహ్వానించాడు రాహుల్‌దాస్.

ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా ''రజిత హత్య గురించి వివరాల కోసం వచ్చాం....'' అనేసరికి.

''రజిత చాలా మంచి అమ్మాయి. ఎందుకిలా అర్ధాంతరంగా జీవితం చాలించిందో అర్థమవట్లేదు. తను ఆత్మహత్య చేసుకునేటంత పిరికిది కాదు...'' అంటున్న రాహుల్ మాటకు అడ్డువస్తూ.

''సారీ అది ఆత్మహత్య కాదు హత్య....'' అంటూ దిద్దాడు రవీందర్.

''హత్య...'' ఉలిక్కి పడ్డాడు రాహుల్.

''ఈ మూడు నెలల్లో మూడు హత్యలు జరిగాయి. ఆ ముగ్గురూ మీ సెక్రెటరీలు అవడం వల్లే మేము మీ దగ్గరకు రావాల్సి వచ్చింది...''

''మీరన్నది నిజమే నా పనులు హడావిడిలో పడి ఈ విషయం నేను గమనించ లేదు. ముగ్గురూ లవ్‌లీ గర్ల్స్....''

''వాళ్ళతో మీ వ్యవహారం ఎలాగుండేది....''

''అఫ్‌కోర్స్ నేను అందరితో చాలా క్లోజ్‌గా ఉండేవాణ్ణి. వీకెండ్స్‌కి పార్టీలకు తీసుకెళ్ళే వాణ్ణి. ఖరీదైన ప్రెజెంటేషన్స్ ఇచ్చేవాడిని...''

''మీ వెంట రంగుల లోకంలో విహరింప చేసి



మీ మోజు తీరగానే మట్టు పెట్టేవారు....కాదంటారా.....?'' అడిగాడు రవి.

''స్టాపిట్.... అమ్మాయిలతో సరదాగా తిరిగిన మాట నిజమే. కాని వాళ్లను చంపాల్సిన అవసరం నాకు లేదు. అయినా మీ అనుమానం నిరాధారమయింది''.

''అక్టోబర్ రెండున రశ్మి చనిపోయింది. అప్పుడు నేను ఇండియాలోనే లేను. అక్టోబర్ మొదటి వారమంతా ఆస్ట్రేలియాలో ఉన్నాను. ఇక నవంబర్ పద్నాలుగున రేఖ చనిపోయినప్పుడు యు. ఎస్.లో ఉన్నా. మొన్న డిసెం బర్ ఇరవై నాలుగున రజిత మరణించినప్పుడు బ్యాంకాక్‌లో ఉన్నాను. ఇదిగో నా ఎయిర్ టికెట్‌లు, పాస్‌పోర్ట్‌లు....'' అంటూ ఓ కవర్ అతని ముందుకు తోసాడు.

రవి అవన్నీ పరీక్షించిన తర్వాత రాహుల్ మాటలు నిజమన్న నిర్ధారణకొచ్చాడు.

''ఉద్యోగ ధర్మంగా ఇవన్నీ అడగాల్సొచ్చింది''

''ఇట్సాల్ రైట్ మీ ధర్మం మీరు చేసారు...''

''మళ్ళీ అవసరపడితే కలుస్తా...''

''తప్పకుండా...యు ఆర్ ఆల్ వేస్ వెల్‌కం''

రాహుల్ నుండి సెలవు తీసుకొని వెళ్ళబోతూ రవి వెనక్కి తిరిగి ''ప్రస్తుతం మీ దగ్గర సెక్రటరీ పోస్ట్ ఖాళీ ఉందనుకుంటా....'' అంటూ అడిగాడు.

''నిజమే ఎవరన్నా మంచి అమ్మాయి ఉంటే చూడండి....'' చెప్పాడు రాహుల్.

రవీందర్ బయట కొచ్చికొత్త కోణంలో ఆలోచిస్తూ జీపుస్టార్ట్ చేసాడు.

★★★

''రవళి.... ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది...'' ఆమె పక్కన కూర్చుంటూ అన్నాడు రవీందర్.

అతనిచేతిలోని చాకోబార్ అందుకుంటూ ''ఎందుకో అంత సంతోషం...?'' అడిగింది రవళి.

''ఇంతకు ముందు చెప్పానుగా సీరియల్ కిల్లర్ కేసు నా చేతికొచ్చిందని. ఆ కిల్లర్‌ను పట్టుకున్నానంటే నాకు ప్రమోషన్ ఖాయం....'' రవి కళ్ళు మిలమిలా మెరిసాయి.

''ఇంకేం....ప్రమోషన్ కొట్టేయ్....నా మెళ్ళో తాళి కట్టేయ్...'' సంబరంగా అంది రవళి.

''రెండు పనులు చెయ్యొచ్చనుకో కాని కొంచెం నీ సహకారం కావాలి....'' నసుగుతూ అన్నాడు రవి.

''ఏం చేయాలి....కొంపదీసి పోలీసుల్లో చేరమనవు కదా....?''

''అలా కాదుగాని రాహుల్ దాస్ సెక్రటరీగా అతని దగ్గర పనిచేయాలి...'' అతని మాట పూర్తికాకుండానే ''ఎందుకూ...?'' అడిగింది రవళి.

''నే చెప్పేది జాగ్రత్తగా విను... ఇంతవరకు జరిగిన ఈ హత్యలన్నీ ఈర్ష్యవల్ల జరిగినవే. అవి గూడా విషప్రయోగం వల్ల. పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో 'అర్సలికం' అనే విషప్రయోగం వల్ల ఈ మూడు హత్యలు జరిగాయి...''

''ఇంతకీ ఈ విషప్రయోగం ఎవరు చేసారంటావు...?''

''రాహుల్ దాస్ భార్య మిసెస్ రాహుల్ దాస్ అదే రమామణి. ఈ అందమైన సెక్రటరీలు తన భర్తను వల్లో వేసుకుంటున్నారని ఈర్ష్యతో రాహుల్ ఊళ్ళో లేనప్పుడు వాళ్ళతో స్నేహం నటించి ఆ అమ్మాయిలను తన ఇంటికి పిలిచి విందులు చేసేది. అమాయకంగా ఆ అమ్మాయిలు విషం కలిసిన విందు భోజనం చేసి ప్రాణాలు వదిలేవారు...''

''ఇప్పుడు ఆ పోస్టులో నేను చేరి నా ప్రాణాలు పోగొట్టుకోమంటావా...'' అంటూ కోపంగా రవి భుజాన్ని బాగా గిల్లింది రవళి.

''నీ ప్రాణానికి ముందు నే చెప్పేది విను. మనకు రమామణి పథకం తెలిసింది కనుక మన జాగ్రతలో మనం ఉంటాం. రమామణిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడమే మనకు కావల్సింది...''

''తప్పదంటావా...?''

''ప్లీజ్ నా కోసం ఒప్పుకో...'' బ్రతిమాలాడు రవి.

''ఓకే కాని జరగబోయే పరిణామాలకు నన్ను బాధ్యురాల్ని చెయ్యొద్దు...''

''ఏం జరిగినా నాదే బాధ్యత సరేనా....'' హామీ ఇచ్చాడు రవీందర్.

★★★

రాహుల్ దాస్ ఆఫీసులో సెక్రటరీగా పనిచేస్తోంది రవళి.

''రవళీ....'' కేకేసాడు రాహుల్ ప్యాడ్, పెన్‌తో ఒక్క అంగలో రాహుల్ చాంబర్‌లో ప్రవేశించింది రవళి.

డిక్టేషన్ తీసుకోడానికి సిద్ధంగా ఉంది.

''ఓహ్ గాడ్ నీకు ఆఫీసు పని తప్ప వేరే ధ్యాస లేదా... నేను పిలిచింది డిక్టేషన్ చెప్పడానికి కాదు ఈ పూట నా లంచ్ ఎక్కడ బేబీ...'' అంటూ అడిగాడు.

''సారీ సార్... మీ లంచ్ మినర్వా కాఫీ క్లబ్‌లో కొంతమంది విఐపి.లతో అంది...'' నొచ్చుకుంటూ అంది.

''దెన్ కమాన్ ఫాలోమి...'' అంటూ రవళిని తనతో బాటు మినర్వా కాఫీ క్లబ్‌కు తీసుకెళ్ళాడు రాహుల్. రిజర్వు చేసిన టేబుల్ ముందు కూర్చుని రవళిని తన ఎదురుగా కూర్చోబెట్టుకున్నాడు. రవళి ఇబ్బందిగా అటూ ఇటూ చూసింది. అక్కడ ఎవ్వరూ వి. ఐ.పి.లు కనిపించలేదు. అదే విషయం రాహుల్‌ను అడిగింది.

''ఈ రోజు లంచ్‌లో నువ్వే వి. ఐ.పి. వి నీ కోసమే ఈ టేబుల్ రిజర్వు చేసాను. నువ్వే ఈ రోజు నా స్పెషల్ గెస్ట్‌వి...'' అంటూ మెనూ కార్డ్ రవళి ముందుకు తోసాడు.

అతని మాటలకు కరిగిపోయింది రవళి. లంచ్ అనంతరం డి.బేర్ లో షాపింగ్ చేసి ఖరీదైన నెక్లెస్ ప్రజెంట్ చేసాడు. ఫోర్డ్ కార్‌లో రవళిని ఇంటి దగ్గర డ్రాప్ చేస్తూ.

''రవళీ నిన్ను చూస్తుంటే వదిలిపెట్టి వెళ్ళాలనిపించట్లేదు. నువ్వు అంగీకరించావంటే నిన్ను నాతో బ్యాంకాక్ తీసుకెళ్తాను. ఇక్కడంతా చికాగ్గా ఉంది. అందరూ నన్నో నేరస్తుడిలా చూస్తున్నారు. అందుకే ఇండియా నుండి బ్యాంకాక్ షిఫ్ట్ అవుదామనుకుంటున్నాను. నువ్వు నాతోనే ఉండిపోవచ్చు...'' అంటూ రవళి చేతిని తన చేతిలోకి తీసుకొని మెత్తగా నొక్కాడు.

రవళికి గుండె మెలి పెట్టినట్లయింది.

★★★

పది రోజుల వరకు రవీందర్‌కు రవళిని కలుసుకునే అవకాశం కలగలేదు. నాలుగు రోజుల క్రితం రాహుల్ బ్యాంకాక్ వెళ్ళినట్లు ఖరారుగా తెలిసింది.

ఇక రమామణి రవళిని డిన్నర్‌కు అహ్వానించే అంకం మిగిలిపోయింది. రవళి ఫోన్‌కై ఎదురు చూస్తున్నాడు రవి.

అతను ఊహించినట్లుగానే ఆ రోజు రవళి నుండి ఫోన్ వచ్చింది.

''కంగ్రాట్స్ రవి నీకు ప్రమోషన్ వచ్చినట్లే. రాహుల్ ఇంటికి వెళ్ళి మిగతా ఫార్మాలిటీస్ పూర్తి చెయ్యి....'' అంటూ ఆజ్ఞాపించింది.

క్షణం ఆలస్యం చేయకుండా రాహుల్ దాస్ ఇంటికి పోలీసులు చేరుకున్నారు. బెడ్ రూమ్‌లో ఓ స్త్రీ శవం కనిపించింది. రవి అదురుతున్న గుండెతో బెడ్‌రూమ్ చేరి ఆ శవాన్ని చూసి 'హమ్మయ్య' అంటూ ఊపిరి పీల్చుకున్నాడు.

అతనికి ఆ ఇంట్లో ఎక్కడా రవళి కనిపించలేదు. రవళి ఇంటికి ఫోన్ చేసాడు రిప్లై లేదు. కాని రాహుల్ ఇంట్లో ఏం జరిగి ఉంటుందో సులభంగా ఊహించాడు. రవళిని రమామణి డిన్నర్‌కు ఆహ్వానించింది. ఆ విషవిందు గురించి తెలిసిన రవళి తను జాగ్రత్తగా ఉంది. అంతేకాదు తనే రమామణి భోజనంలో విషం కలిపింది. అంటే ఎత్తుకు పై ఎత్తు వేసి రమామణిని అంతం చేసింది.

అంత వరకూ బాగానే ఉంది. కాని రవళి ఎక్కడికి వెళ్ళింది...? అనే ప్రశ్న అతని మెదడును తొలుస్తోంది. ఆ ప్రశ్నకు సమాధానం మరునాడు గాని తెలియలేదు.

★★★

కొరియర్‌లో వచ్చిన ఉత్తరాన్ని ఆత్రంగా చింపాడు రవీందర్?

''రవీ! ఈ ఉత్తరం నీకు చేరేసరికి నేను బ్యాంకాక్‌లో మిసెస్ రాహుల్‌దాస్‌గా కాలుపెడుతున్నాను. బహుశా ఇప్పట్లో ఇండియా రానేమో... రమామణి అడ్డు తొలగింది గనుక రాహుల్ నన్ను తన సామ్రాజ్యానికి రాణిని చేస్తాడు. మొదట్లోనే చెప్పాను జరగబోయే పరిణామాలకు నేను బాధ్యురాల్ని కానని. పోలీసుల్ని ప్రేమించి పొరపాటు చేసాననుకున్నాను కాని నీ వల్ల నా జీవితమే మారిపోయింది.''

''థ్యాంక్స్... ఎస్. ఐ గారు... నీకు కాకుండా పోయిన రవళి''

తీవ్రమైన షాక్‌కు గురయ్యాడు ఎస్.ఐ. రవీందర్.

★

